ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



సాయిబాబా గుడి ప్రాంతంలోని ఆరోగ్య కేంద్రం

వైద్యులు లేక. వైద్యసేవలు అందక..

- సెలవుపై వెళ్లిన డాక్టర్లు
- వైద్య సిబ్బందే దిక్కు
- రోగులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి- కనిగిరి

పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కనిగిరి పట్టణంలో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఆరోగ్య కేంద్రాలకు జబ్బు చేసింది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లి భద్రత లేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందడంతో తమ ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

నెల రోజుల నుంచి సెలవులో వైద్యాధికారులు

కనిగిరి మున్సిపాలిటీ గార్లపేట రోడ్డు లోని సాయిబాబా దేవస్థానం ప్రాంతంలోనున్న ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నెలరోజుల క్రితం మెటర్నటీ లీవ్‌పై వెళ్లింది. ఈమె ఆరు నెలల పాటు సెలవులో ఉండే పరిస్థితి ఉంది. ఇందిరా కాలనీ పరిధిలోని వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంతంలోని ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి 15 రోజుల క్రితం లాస్ ఆఫ్ పే కింద సెలవుపై వెళ్లాడు. ఈయన మరో నెల రోజులపాటు సెలవులో ఉంటారని తెలిసింది.. దీంతో రెండు ఆరోగ్య కేంద్రాలలో వైద్యుల కొరత ఏర్పడింది.

వైద్య సిబ్బందితో అరకొర వైద్య సేవలు

ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు సెలవులో వెళ్లితే వారి స్థానంలో ఉన్నతాధికారులు ఇన్‌ఛార్జులను నియమించలేదు. దీంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్య సిబ్బంది రోగులకు వైద్యసేవలు ▶ 2లో

జాతీయ రహదారుల అనుసంధానంతో

మారనున్న జిల్లా రూపురేఖలు

- బాపట్ల జిల్లాలో ఆరు జాతీయ రహదారులు
- హైదరాబాదు, బెంగుళూరుకు తగ్గనున్న దూరం
- పెరగనున్న పర్యాటకులు



నిర్మాణంలో ఉన్న 167ఎ జాతీయ రహదారి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాను అనుసంధానం చేస్తూ పలు జాతీయ రహదారులను నిర్మిస్తున్నారు. దీంతో రవాణా, పర్యాటకపరంగా జిల్లా రూపురేఖలు మారుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో ఈ పాటికే చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి-16 ఉంది. దిగమర్రు-ఒంగోలు 216 జాతీయ రహదారి ఉంది. మేదరమెట్ల-అద్దంకి -నార్కెట్‌పల్లి 65జాతీయ రహదారి ఉంది. చీరాల వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు 167ఎ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుంది. ఈ రహదారిని బాపట్ల జిల్లాలోని వాడరేవు వద్ద నుంచి కారంచేడు, పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా పిడుగురాళ్ల దగ్గర నకరికల్లు అడ్డరోడ్డు వరకూ నిర్మిస్తున్నారు. ఈ రహదారి పూర్తయితే జిల్లా నుంచి హైదరాబాద్‌కు తక్కువ సమయంలో వెళ్లొచ్చు. రూ.1,064 కోట్ల వ్యయంతో ఈ హదారిని నిర్మిస్తున్నారు. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల మీదుగా హైదరాబాద్ రహదారికి దీన్ని అనుసంధానం చేస్తారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ రహదారి నిర్మాణం పూర్తి కావాల్సిఉంది. ఇది పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లా నుంచి హైదరాబాద్‌కు తక్కువ సమయంలో వెళ్లొచ్చు. తెలంగాణ వైపు నుంచి జిల్లా లోని సముద్ర తీర ప్రాంతానికి పర్యాటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. వాడరేవు-నకిరేకల్లు జాతీయ రహదారి 167ఎ నిర్మాణంలో కారంచేడు, పర్చూరు, వేటపాలెం, చీరాల మండ లాలలో భూ సేకరణ సమస్యలు ఉన్నాయి. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి నగదు చెల్లింపులు జరగాల్సిఉంది. ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఎప్పటినుంచో నివాసముంటున్న వారి నివాసాలు తొలగించారు. వారికి ప్రత్యాన్నాయం చూపాల్సిఉంది. చట్టబద్ధంగా పరిహారం అందించాల్సిఉంది.

బెంగళూరు నుంచి విజయవాడకు జాతీయ రహదారి

బెంగళూరు నుంచి విజయవాడ వరకూ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి జిల్లా లోంచి వెళ్ళనుంది. జాతీయ రహదారి 44 కర్ణాటక రాజధాని బెంగళూరు నుంచి మొదలయి రాష్టం లోని 8 జిల్లాల మీదుగా విజయవాడ వరకూ నిర్మాణం జరుగుతుంది. రాష్టంలోని శ్రీ సత్యసాయి జిల్లాలోని కోడికొండ నుంచి రాయలసీమ ప్రాంతం మీదుగా బాపట్ల జిల్లా లోని అద్దంకి సమీపంలోని ముప్పవరం వద్ద చెనై - కోల్‌కతా జాతీయ రహదారి 16లో కలు స్తుంది. ఈ రహదారి నిర్మాణం వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి ▶ 2లో

బోర్లు వేసి.. నీరు పడక..

- 500 బోర్లు వేసినా ప్రయోజనం శూన్యం
- రైతుల కష్టం మట్టిపాలు



నీరు పడక వదిలేసిన బోరు గుంత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వేసవి తీవ్రత పెరిగే కొద్దీ రైతుల్లో ఆశలు ఆవిరైపోతున్నాయి. భూగర్భజలాలు పడిపోయి నీటి కోసం చేసిన పోరాటం చివరికి నష్టం, కన్నీటి వ్యథగా మిగుతోంది. ఒక్క నెలలోనే 500కు పైగా బోర్లు వేసేరంటే నీటి తీవ్రత అర్ధమవుతుంది.

మండల పరిధిలోని తమ్మడపల్లి, వాదంపల్లి, గురిజేపల్లి, మొగుళ్లపల్లి, కొలుకుల, వీరభద్రాపురం, అమానుగుడి పాడు, గుర్రపుశాల, బోయలపల్లి, మురారిపల్లి, అయ్యంబొట్లపల్లి, గోళ్లవిడిపి గ్రామాల్లో రైతులు నీటి కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశారు. రూ.లక్షలాది రూపాయలు పెట్టిన 800 అడుగులు నుంచి వెయ్యి అడుగుల లోతులో బోరు వేసే చుక్క నీరు కూడా పడకపోవడం రైతు గుండెను కలచివేస్తోంది.

తోటలను కాపాడుకునేందుకు..

బొప్పాయి, బత్తాయి, నిమ్మ, అరటి లాంటిఉద్యాన పంటలు తడులు లేక వాడిపోతున్నాయి. మొలకలు ఎండిపోవడం, చెట్లు ముదరకుండానే క్షీణించిపోయితున్నాయి. అవి చూసి రైతుల నిరాశకు గురవున్నారు. తమ కష్టాన్ని నిలుపుకొనేందుకు కొందరు ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి పంటలకు తడులు అందిస్తున్నారు. మరికొందరు అకాల వర్షాలు కురవకపోతాయా అంటూ ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నెలలోనే రూ.పది కోట్లు నష్టం..

యర్రగొండపాలెం మండలంలో ఏప్రిల్ మొదటి వారం నుంచి ఇప్పటి వరకూ రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు 500 వరకూ అదనపు బోర్లు వేయించారు. అప్పులు చేసి మరి రూ.రెండు లక్షల ఖర్చుతో ఒక్కో బోరును 800 నుంచి వెయ్యి అడుగుల లోతున వేయించారు. సుద్దరాళ్లు తప్పా చుక్కనీరు పడలేదు. దీంతో సుమారు రూ.పది కోట్ల ▶ 2లో

జాతీయ రహదారుల అనుసంధానంతో మారునున్న జిల్లా రూపు రేఖలు

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందని భావిస్తున్నారు. ఈ రహదారి రాయలసీమ ప్రాంతం పులివెందుల, మైదుకూరు, కనిగిరి, పొదిలి, అద్దంకి, చిలకలూరిపేట, గుంటూరు, మంగళగిరి మీదుగా విజయవాడ వెళుతుంది. ఈ రహదారి జిల్లా వాసులు రాయలసీమ జిల్లాలతో పాటు బెంగుళూరు వెళ్ళడానికి దగ్గర మార్గంగా ఉంటుంది. జిల్లాలో నిర్మాణంలో ఉన్న వాడరేవు-నకిరేకల్లు, బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాల్సిఉంది. బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి జిల్లా పరిధిలో పలుచోట్ల భూ సేకరణ సమస్యలు ఉన్నాయి. స్థానికుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

నిజాంపట్నం హార్బర్ నుంచి అమరావతికి జాతీయ రహదారి

జిల్లా పరిధిలో ఇప్పటికే ఉన్న మూడు జాతీయ రహదారులు, నిర్మాణంలో ఉన్న మరో రెండు జాతీయ రహదారులతో పాటు నూతనంగా జిల్లాలోని నిజాంపట్నం హార్బర్ నుంచి అమరావతి అవుటర్‌రింగ్ వరకూ మరో గ్రీన్ ఫీల్డ్ హైవే రానుంది. ఫిషింగ్ హార్బర్లు, నౌకాశ్రయాలను జాతీయ రహదారులతో అనుసంధానించే ప్రాజెక్టులను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ మంజూరు చేస్తుంది. ఇందులో భాగంగా నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి నూతన జాతీయ రహదారి నిర్మాణం కోసం నాలుగు లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం నియమించిన కన్సల్టెన్సీ నాలుగు రూట్ మ్యాపులను రూపొందించారు. ఈ మేరకు గతవారం గుంటూరు కలెక్టరేట్‌లో గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులుసమావేశం నిర్వహించారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం హార్బర్ వరకూ కొత్తగా (గ్రీన్ ఫీల్డ్) నాలుగు లైన్ల 47.848 కి.మీ రోడ్డు నిర్మాణంపై స్టేక్ హోల్డర్స్‌తో కలిసి సమీక్షించారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రతిపాదించిన రెండవ ఎలైన్‌మెంట్‌కు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈనేపథ్యంలో నూతన రహదారి నిర్మాణ పనులకు అన్ని అనుమతులు పొందిన తరువాత ఆరు నెలల్లో భూ సేకరణ పూర్తి చేయాలని, 18 నెలల్లో రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. జిల్లా పరిధిలోని ఆరు జాతీయ రహదారులు సమకూరిన నేపథ్యంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి. జిల్లా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

బోర్లు వేసి.. నీరు పడక..

(మొదటిపేజీ తరువాయి)

రూపాయలు మట్టిపాలు అయ్యాయి.

మూడు బోర్లు వేయించినా

బాశం రమణారెడ్డి, రైతు, మురారిపల్లి



పంటలను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేయించా. వాటిలో చుక్క నీరు పడలేదు. బోర్లు వేసేందుకు అప్పులు చేయాలి వచ్చింది. నీరు పడకపోవడంతో ఇటు పంటలు దక్కక, అటు నీరు పడక రెండు విధాలుగా నష్టపోయా. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యవసాయం చేయడం కష్టమే.

ఒక బోరు వేయించా నీరు పడలేదు

దేపావత్ కోటేశ్వర్లు నాయక్, రైతు, పిల్లికుంట తండా



తోటలను కాపాడుకునేందుకు బోరు వేయించా. చుక్కనీరు పడలేదు. గతంలో వేయించిన బోరు గతుకుతుంది. ఎకరం తడులు పెట్టాలంటేనే వారం రోజులు పట్టే పరిస్థితి నెలకొంది. దీంతో తోటలను బతికించుకోవడం కష్టంగా మారింది.

వర్షం పడితే..
ఆ రహదారిలో 'నడక'యాతనే!

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఒక్క పనీ మంజూరు కాలేదు. సిఎం చంద్రబాబు మాత్రం గత సంక్రాతి నాటికే గుంతల్లేని రహదారులు ఉంటాయన్నారు. ఆచరణలో ఆయన మాటలకు.. చేతలకు పొంతన లేకుండా పోయింది!

మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో గల ఆదర్శ అపార్ట్‌మెంటు రహదారి అంతర్గత రహదారుల్లో ఇది ప్రధానమైనదే కాక పట్టణంలో 30 అడుగుల వెడల్పు కలిగిన రహదారుల్లో ఇది కూడా ఒకటి. ఈ రహదారిలో సుమారు 250 కుటుంబాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిలో సగం వరకు మాత్రమే సిమెంటు రహదారి, దానికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించారు. మరో 100 మీటర్ల దూరం వరకు సిమెంటు రహదారి నిర్మిస్తే గానీ ప్రధాన రహదారిలో అనుసంధానం కాదు. ఎస్‌వికెపి కళాశాల రహదారి నుంచి ఆదర్శ అపార్ట్‌మెంటు సమీపానికి 100 మీటర్లలో రహదారి నిర్మాణానికి నోచుకోలేదు. ప్రవేశమార్గంలో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. స్థానికులే అప్పుడప్పుడూ మట్టితో గుంతలను పూడ్చుకుంటున్నారు. వర్షం కురిసిన సమయంలో ఆ రహదారిలో బురద నీరు నిండుకుంటోంది. ఆ సమయంలో నడక నరకయాతనగా ఉంటోంది. జారుడుబల్లగా రహదారి మారుతోంది. రహదారి పక్కనే ఉన్న అరవింద సమగ్ర విద్యా కేంద్రానికి విద్యార్థులు వెళ్లాలన్నా ఈ రహదారిలో




బురద నీటితో నిండిన రహదారి

ప్రయాణించాల్సిందే. చిన్నారులు, వృద్ధులు రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు, అసౌకర్యానికి గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు అక్కడి జనం పలుమార్లు రహదారి సమస్యను వివరించినా నిధుల కొరత అంటూ దాట వేస్తున్నారు.

ఇదే రహదారి నిర్మాణానికి గత వైసిపి ప్రభుత్వంలో గడప గడప కార్యక్రమంలో నిధులు మంజూరయ్యాయి. ఆ పనిని బండి రమణారెడ్డి అనే కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. అతనికి మంజూరైన 40 మీటర్ల సిమెంటు రహదారిని నిర్మించారు. రహదారి ఆసాంతం మురుగు కాలువ నిర్మాణం పూర్తి చేశారు. ఇక మిగిలిన 100 మీటర్ల రహదారి కూడా నిర్మిస్తానని ముందుకు వచ్చారు. ఇదంతా 2024 ఎన్నికల సమయానికి ముందుగా జరిగింది. మరో కాంట్రాక్టర్ మిగిలిన 100 మీటర్ల రహదారి పనిని దక్కించుకున్నారు. పనిమాత్రం మొదలు పెట్టలేదు. బండి రమణారెడ్డి అనే కాంట్రాక్టర్ ఆ పనిని మొదలు పెడతానని చెప్పినా... మరో కాంట్రాక్టర్ అంగీకరించలేదు. తనకు అప్పగించిన పని చేయకపోగా... చేస్తానని ముందుకు వచ్చిన కాంట్రాక్టర్‌ను కూడా అడ్డుకున్నాడు. ఆరోజున సత్తా లేని కాంట్రాక్టర్ పనిని అడ్డుకోకపోతే ప్రస్తుతం రహదారి బాగుండేదని, ఈ కష్టాలు ఉండేవి కాదని అక్కడి ప్రజలు పదేపదే గుర్తు చేసుకుని బాధపడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, రహదారి నిర్మాణానికి సహకరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో ఈ నెల 19వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాటుల చేసినట్లు ఎంఈవో పి ఆంజనేయులు తెలిపారు. రెగ్యులర్ పదో తరగతికి ఐదు సెంటర్లు కేటాయించినట్లు చెప్పారు. వాటిలో 314 మంది పరీక్ష రాస్తున్నట్లు పేర్కొన్నారు. ఓపెన్ ఇంటర్‌కు రెండు సెంటర్లు కేటాయించగా 211మంది, ఓపెన్ పదో తరగతికి రెండు సెంటర్లు కేటాయించగా 192 మందిని కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షల చీఫ్‌గా మధుసూదనరావు, నలందా ఉన్నత పాఠశాలకు మంత్రు నాయక్, జడ్పి ఉన్నత పాఠశాలకు పిచ్చిరావు, చైతన్య ఉన్నత పాఠశాలకి హేమ్లా నాయక్, గురుకుల బాలుర పాఠశాలకు బాలు నాయక్ చీఫ్‌లుగా వ్యవహరిస్తారన్నారు. ఓపెన్ ఇంటర్ జూనియర్ కళాశాలకు జేమ్స్‌పాల్, నలందా హైస్కూల్‌కి నాగరాణి, ఓపెన్ పదో తరగతి రెయిన్‌బో పాఠశాలకు దేవిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెంకట రాములు చీఫ్‌లుగా వ్యవహరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మంత్రునాయక్, బ్రహ్మయ్య, పిచ్చిరావు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు లేక.. వైద్యసేవలు అందక

(మొదటిపేజీ తరువాయి)

అందించ కూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఇక్కడ అమలు కావటం లేదు. వైద్యాధికారులు లేక పోవడంతో వైద్య సిబ్బందే సేవలు అందిస్తున్నారు. పాత పేషెంట్లకు మాత్రమే సేవలు అందిస్తున్నామని కొత్త రోగులకు వైద్య సేవలు అందించడం లేదని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు పంపుతున్నట్లు వారు చెబుతున్నారు. అవసరమైతే డిప్యూటీ డి ఎంహెచ్ ఓ సలహా తీసుకొని వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొంటున్నారు.

ప్రజల ప్రాణాలకు బాధ్యత ఎవరిది?

వైద్యాధికారులు సెలవులో వెళ్లడంతో వైద్య సిబ్బంది రోగులకు సేవలు అందిస్తున్నారు. దీంతో ప్రజల ప్రాణాల తో చెలగాటం ఆడుతున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఎమైనా ఘటనలు చోటు చేసుకుంటే ప్రజల ప్రాణాలకు రక్షణ ఏమిటని, బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కనిగిరి పట్టణంలోని రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వైద్యాధికారులను నియ మించాలని, వైద్య సేవలను వైద్యుల పర్యవేక్షణలో రోగులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి

జెవివి సీనియర్ నాయకులు వివిఆర్

పీసీపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న మాలకొండారెడ్డి

ప్రజాశక్తి-పీసీపల్లి

విద్యార్థులను మంచి పౌరులుగా తయారు చేయాలని, నిజాన్ని నిర్భయంగా మాట్లాడే విధంగా తయారు చేయాలని జెవివి సీనియర్ నాయకులు వి .మాలకొండా రెడ్డి అన్నారు. పిసీ పల్లి జడ్పీ హైస్కూల్లో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆనాటి ఉపాధ్యాయులు పాల్గొని ప్రసంగించారు. నేడు సమాజంలో అనేక రుగ్మతలు ఉన్నాయని వాటిని అధిగమించేందుకు చదువుకున్న వ్యక్తులుగా తమ పిల్లలపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులు అన్నారు. విలువలుతో కూడిన జీవితాన్ని గడపాలన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి, వంటగదిని నిర్మించడం, మహిళలలకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించడం లాంటి సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. పిసీపల్లి జడ్పీ హైస్కూల్లో పదో తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన గుంటగాని సుదర్శన చరణ్‌కు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని కోడూరు ఎరుకల రెడ్డి అందించారు. అదేవిధంగా మరో విద్యార్థి బడుగు రమేష్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ సీటు వచ్చిన వారికి సంవత్సరానికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. పాఠశాలకు అవసరమైన వసతుల కోసం తమ బ్యాచ్ విద్యార్థులు సహాయం అందజేస్తామని కూడా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కవి కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, అప్పటి ఉపాధ్యాయులు పిల్లి రఘురామి రెడ్డి, జి. చెన్న కృష్ణారెడ్డి, ఎస్. వెంకటేశ్వర్లు, కె.రామి రెడ్డి, వి.కవిత స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డేగ ఆంజనేయులు, ఎంఈఓలు జి.సంజీవ్, ఆర్.శ్రీనివాసులు, రత్నయ్య, గల్లా చెన్నయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజాల మధు, కాకర్ల బాబురావు, గోగడ రమేష్ తదితరులు ఉన్నారు.



మృతి చెందిన గేదె వద్ద రోదిస్తున్న రైతు

పిడుగుపడి గేదె మృతి

ప్రజాశక్తి-చీరాల

పిడుగుపాటుకు గేదె మృతి చెందిన ఘటన చీరాల మండలం కొత్త పాలెం గ్రామంలో జరి గింది. అందిన వివరాల మేరకు.. శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో చీరా ల మండలంలో పలు చోట్ల పిడుగులు పడ్డా యి. ఈ నేపథ్యంలో చీరాల మండలం కొత్తపాలెం గ్రామంలో అక్కల సుబ్బారెడ్డి పశువుల కొష్టంపై పిడుగు పడటంతో సుమారు రూ.1 లక్ష విలువ గల గేదె మృతి చెందింది. రోజులాగే ఉదయాన్నే లేచి మేత వేసి, పాలు కోసం గేదె వద్దకు వెళ్లడంతో మృతి చెంది పడిఉంది. ఇంటి బిడ్డగా చూసుకునే తమ గేదె కళ్ళ ముందు జీవచ్ఛవంలా పడి ఉండ టం చూసి అక్కల సుబ్బారెడ్డి దంపతులు బోరున విలిపిం చారు. సమాచారం అందుకున్న సచివాలయ శాఖ సిబ్బంది బాధితులను నుంచి వివరాలు సేకరించారు. ఇది ఇలా ఉండ గా గత వారం రోజుల క్రితం అదే కొత్తపాలెం పంచాయతీలో మరో గేదె పిడుగుపాటుకు మృతిచెందగా ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య రూ.1లక్ష ఆర్థిక సహాయాన్ని రైతు కు అందజేశారు. అయితే కుటుంబానికి పోషణగా ఉన్న గేదె మృతి చెందటంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

టీడీపీ తాళ్లూరు మండల అధ్యక్షుడిగా మేడగం వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-తాళ్లూరు



వెంకటేశ్వరరెడ్డి

టీడీపీ మండల అధ్యక్షుడిగా లక్కవరం గ్రామానికి చెందిన మేడగం వెంకటేశ్వర్ రెడ్డిని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మేడగం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తనకు మండల స్థాయి పదవి ఇచ్చినందుకు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మరియు కడియాల లలిత సాగరకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. తాను తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అందరినీ కలుపుకొని పోయి గ్రామాలలో పార్టీ బలోపేతానికి తనం శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

టిడిపి కురిచేడు మండల అధ్యక్షుడిగా పిడతల నెమలియ్య

ప్రజాశక్తి-కురిచేడు



నెమలియ్య

కురిచేడు మండల టీడీపీ అధ్యక్షునిగా రెండోసారి పిడతల నెమలియ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దర్శిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం లోని ఐదు మండలాల అధ్యక్షుల నియామకం జరిగింది. దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. కురిచేడు మండల అధ్యక్షునిగా నిములయ్యను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల మండల తెలుగుదేశం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మొగల్ మస్తాన్వలి, టిడిపి మండల మాజీ అధ్యక్షులు కాట్రాజ్ నాగరాజు, టిడిపి డాక్టర్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ షేక్ సునీల్, నాయకులు కిలారి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దొనకొండ మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు

ప్రజాశక్తి-దొనకొండ



ఆంజనేయులు

దొనకొండ మండల టీడీపీ అధ్యక్షుడిగా యర్రబాలెం గ్రామంకు చెందిన టీడీపీ నాయకుడు మోడి ఆంజనేయులును దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆదివారం ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండి పార్టీ అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన టీడీపీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చీకట్లో పారిశ్రామికవాడ

అవస్థలు పడుతున్న కార్మికులు

ప్రజాశక్తి-శింగరాయకొండ



అంధకారంలో పారిశ్రామికవాడ

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు... శింగరాయకొండ పారిశ్రామిక వాడలో లైట్లు ఉన్నప్పటికీ అధికారులు లైట్లు వేయకపోవడంతో చీకట్లో గడపాల్సిన పరిస్థితి నెలకొంది. గత వారం రోజులుగా పారిశ్రామిక వాడలో వీధి లైట్లు లేక పారిశ్రామిక వాడలోని యాజమానులు దగ్గర నుంచి కార్మికుల వరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామిక వాడ అధికార యంత్రాంగంకు అక్కడ ఉన్న వాళ్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పారిశ్రామిక వాడలో లైట్లు వేయాలని కోరుకుంటున్నారు.



జెసిబిని స్వాధీనం చేసుకున్న అధికారులు

అక్రమ మైనింగ్‌పై దాడులు

యంత్రాలు, వాటర్ ట్యాంక్ సీజ్

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి బీటులో చీరలదిన్నె నుండి నేల్లంకొండ దారిలో రిజర్వ్ ఫారెస్ట్ కంపార్ట్మెంట్ నెంబర్ 464 లోని కొసరపుకుంట ప్రదేశంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా వైట్ క్వార్ట్జ్ తవ్వకం జరిపి కుప్పలు పెట్టియుండగా ఎఫ్ఆర్వో బి నరసింహరావు సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. అక్రమంగా మైనింగ్ జరిగిన తీరును పరిశీలించారు. మైనింగ్‌కి ఉపయోగించిన ప్రోక్లైన్ మరియు వాటర్ ట్యాంకు సీజ్ చేశారు. పని ప్రదేశంలో ఉన్న వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్‌పై విచారిస్తున్నారు. ఎఫ్ఎస్ఓ ఎస్ ఏ ఆలిం, సిఎస్పురం ఎఫ్ఎస్ఓ జే వెంకటేశ్వర్లు, నాగిరెడ్డిపల్లి బీట్ ఆఫీసర్ డి.దొరసాని, కనిగిరి ఎఫ్‌బిఓ ఎస్ నరసింహ, షేక్ బషీర్, ఏబీవో హాజీస్, కనిగిరి సెక్షన స్ట్రైకింగ్ ఫోర్స్ పి.వెంగళరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి

కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలి

గ్రామస్థులకు మెరైన్ పోలీసుల అవగాహన

ప్రజాశక్తి-శింగరాయకొండ



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రస్తుత పరిస్థితుల్లో సముద్ర తీర ప్రాంతం నుంచి వచ్చే ప్రతి ఒక్కరిని గమనించడంతోపాటు సముద్ర తీర ప్రాంతంలో కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం తెలియజేయాలని రామాయపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ మస్తాన్ షరీఫ్, కానిస్టేబుల్ జె.సన్యాసి రావు తెలిపారు. శింగరాయకొండ మండలం పాకల గ్రామపంచాయతీ పరిధిలోని చెల్లెమ్మగారి పట్టపుపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి బస చేసి, గ్రామ కాపులతో, గ్రామ ప్రజలతో సమావేశం అయ్యారు. భారత్, పాకిస్తాన్ యుద్ధ వాతావరణం (ఆపరేషన్ సింధూర్) నేపథ్యంలో సముద్ర తీర ప్రాంత గ్రామాలు అన్ని అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తుల కదలికలు గమనిస్తూ ఉండాలని, అనుమానాస్పద సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్‌కి, రామాయపట్నం మేరైన పోలీస్ స్టేషన్‌కు తెలియచేయాలన్నారు. సముద్రం మార్గం ద్వారా మన దేశంలోకి చొరబడకుండా అందరూ తమవంతు బాధ్యత వహించాలని తెలిపారు.

నేటి నుంచి జెవివి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు

జెవివి జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస రెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి



శ్రీనివాసరెడ్డి

కనిగిరి పట్టణంలోని నీలకంఠంవారి వీధిలో ఉన్న సిమ్ ఇన్‌స్టిట్యూట్‌లో మే 19 నుంచి 24వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ క్యాంపులో డ్రాయింగ్, పాటలు, డాన్స్, సైన్స్ ప్రయోగాలు, హ్యాండ్ రైటింగ్, మ్యాజిక్, ఫన్నీ మాథ్స్, మెమరీ గేమ్స్ నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృనాత్మకతను వెలికి తీయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మూడో రోజు అలరించిన నాటిక పోటీలు

ప్రజాశక్తి-దర్శి

దర్శనాపురి నాటకళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన నాటిక పోటీలు మూడో రోజు ఆదివారం అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి "స్వేచ్ఛ నాటిక ఆకట్టుకుంది. అదేవిధంగా శ్రీకాకుళం వారి "ద్రౌపది" కూచిపూడి సంగీత నృత్యరూపకం చూపరులను కట్టిపడేసింది. ఈ నాటికి పోటీలు దర్శనాపురి నాటకళాపరిషత్తు ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ఘనంగా జరిగాయి. చివరి రోజున బహుమతులు ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొని బహుమతులు అందజేశారు. బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చీమకుర్తి వారి సౌజన్యంతో చివరి రోజు నాటికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కలవకాలను అనంత్, కార్యదర్శి డాక్టర్ ప్రసాద్ రెడ్డి, వైసీపీ సోమ దుర్గారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, డాక్టర్ ఎస్ఎం భాష, ధన రెడ్డి వెంకట్ రెడ్డి, రంగారావు, దేవేందర్ రెడ్డి మోషే తదితరులు పాల్గొన్నారు.



మండప నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న దాతలు

మండప నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి భారీగా విరాళాలు భక్తులు సమర్పిస్తున్నారు. పట్టణ, ఇతర ప్రాంతాల భక్తులు మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన మానం మురళీమోహన్ దాస్, సరిత దంపతులు, కోనేటి వెంకటేశ్వర్లు, అతని కుటుంబ సభ్యులు మండప నిర్మాణానికి రూ.101,116, రూ.3,69,999 వీరితోపాటు మరో ముగ్గురు దాతలు దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి మదమంచి తిమ్మనాయుడుకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో సందిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బత్తుల వీరనారాయణ

కమ్యూనిటీ కిచెన్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పంగులూరు

మండల కేంద్రమైన పంగులూరులో కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ఏర్పాటు చేసి వృద్ధులకు ప్రతిరోజు పోషకాహారం అందించటం అభినంద నీయమని, కాకతీయ ఫౌండేషన్ డొనేషన్స్ క్లబ్ చైర్మన్ పాటిబండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. కాకతీయ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధులు చిలుకూరి శ్రీధర్, బాచిన శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన సభలో పాటిబండ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు కాకతీయ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను వివరించారు. గ్రామంలో ఆసరా లేని వృద్ధులకు నిత్యం పోషకాహారం అందిస్తున్న కమ్యూనిటీ కిచెన్ నిర్వహణకు ఆర్థిక సహకారం అందించాలని చిలుకూరి శ్రీధర్, బాచిన శ్రీనివాసరావు కోరారు. ఒంగోలు కమ్మ సంఘం ప్రతినిధులు మండవ సుబ్బారావు, నండూరి శ్రీరాములు, అంగలకుర్తి నరసింహం, కాకతీయ విద్యా ట్రస్ట్ కోశాధికారి వెంకయ్య చౌదరి, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బత్తుల వీరనారాయణ, విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిని రామారావు, ప్రిన్సిపాల్ దోప్పలపూడి శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు చిలుకూరి వీరరాఘవయ్య, మేడ సుబ్బారావు, బాచిన చౌదరి బాబు, బాచిన రత్నకుమారి పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న విజయ్ కుమార్

సమ్మర్ క్యాంప్‌తో విజ్ఞానం

ప్రజాశక్తి - బాపట్ల

వేసవి క్యాంపులు విద్యార్థుల్లో విజ్ఞానం, వినోదం పంచేందుకు ఎంతగానో దోహదపడతాయని విశ్రాంత ఆచార్యులు కె విజయ్ కుమార్ అన్నారు. పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో భావపురి చిల్డ్రన్ క్లబ్ కన్వీనర్ టి సుభాషిణి ఆధ్వర్యంలో వారం రోజులగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పిల్లలకు ప్రోత్సాహక ధ్రువీకరణ పత్రాలు ఆదివారం అందజేశారు. గణితంపై బాపూజీ మాస్టర్ మెళకువ లు నేర్పించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్, జెవివి జిల్లా అధ్యక్షులు భాస్కరరావు, సిఐటియు ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య, నాయకులు కె శరత్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ఎన్టీఆర్, నాగేశ్వరరావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పర్చూరు

ప్రజల చెంతకే కార్పొరేట్ వైద్యానికి తీసుకువచ్చి రూపాయి ఖర్చు లేకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ కంటి ప్రదాతగా, ఆరోగ్య ప్రదాతగా ఇస్తారని ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు నిలుస్తున్నారని అన్నారు. ఆయనకు తమ ఆశీస్సులు నిండు నూరేళ్లు ఉండాలని, క్యాంపుకు వచ్చిన పలువురు కంటి బాధితులు ఎమ్మెల్యే ఏలూరిని ఆశీర్వదించి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని చెరుకూరులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో గ్రామంలోని హై స్కూలులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో విశేష స్పందన లభించింది. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు ప్రసంగించారు. రాజకీయాలకతీతంగా ఎమ్మెల్యే ఏలూరి నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజా గుండెల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు. ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేయడంలో ఎమ్మెల్యే ఏలూరికి ఎవరు సాటిరారని పేర్కొన్నారు. తన నియోజకవర్గ ప్రజలకు మంచి ఆరోగ్యం ఉండాలని తలంపుతో కార్పొరేట్ ఆసుపత్రులను అనుసంధానం చేస్తూ ప్రతి నెల వైద్య సేవలు నిర్వహించడం, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ ద్వారా ప్రతినిత్యం ప్రజల బాగోగులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు పైసా ఖర్చు లేకుండా ఎమ్మెల్యే ఏలూరి సొంత నిధులతో ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూ ప్రజా నాయకుడిగా నిలిచారని అన్నారు. ప్రచార ఆర్భాటం లేకుండా నిరంతరం సేవ చేయడం ఏలూరి నైజం అన్నారు. తన నియోజకవర్గంలో లక్ష మందికి తన వంతు బాధ్యతగా కంటిచూపు అందించాలని గొప్ప సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి ముందుకు రావడం అందరికీ గర్వకారణం అన్నారు. రాజకీయాలకు అతీతంగా సమాజ సేవకు నిరంతరం పరితపించే వ్యక్తి ఏలూరి అని కొనియాడారు. ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 8గంటలకే ప్రజలు పెద్ద ఎత్తున క్యాంపుకు హాజరయ్యారు. హాజరైన వారి కోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేశారు. మహిళలకు పురుషులకు వేరు వేరుగా వైద్య పరీక్షలు నిర్వహించేలా ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారం వద్ద రెండు ఓపి కేంద్రాలు ఏర్పాటు చేసి, క్యాంపుకు వచ్చిన వారికి బిపి షుగర్ రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాంపుకు 553 మంది హాజరు కాగా వారిలో 158 మందికి చికిత్సలు నిర్వహించేలా వైద్యులు రిఫర్ చేశారు. మజ్జిగ, మంచినీళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఉషారాణి, కారుమంచి కృష్ణ, షేక్ జమాలుద్దీన్, పాలేటి కోటేశ్వరరావు, రామకృష్ణ, మానం హరిబాబు, మక్కెన శేఖర్‌బాబు, సాంబయ్య, ఫ్యాక్టరీ శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు, అప్పలనే నరేంద్ర, నాగరాజు, శంకర్రావు, ఆదినారాయణ, వెంకటసుబ్బయ్య, దాస్, భుట్టో పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

డాక్టర్ 'చేరెడ్డి'కి విశిష్ట సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీ కౌముది సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పుట్టంరాజు కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 'పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ విశిష్ట సాహిత్య పురస్కారం' ప్రదానోత్సవంలో పద్యకవితా ప్రవీణుడు, పద్యకళానిధి డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డికి పురస్కారం అందచేసి ఘనంగా సత్కరించారు. ఈ సభకు గాడేపల్లి దివాకరదత్తు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చేరెడ్డి కవిత్వాన్ని విశ్లేషిస్తూ ఆయన పద్యాల్లో తెలుగు పలుకుబడులు, పదబంధాల విన్యాసం, శబ్దాలంకారాలు, భావవైభవం, శైలీ వైశిష్ట్యం అన్నీ సమన్వయంగా ప్రతిఫలిస్తుంటాయని అన్నారు. పాఠకుల హృదయాలు ఆకట్టుకునే మహత్తర కవిత్వాన్ని అందించారని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ప్రశంసించారు. డాక్టర్ యు దేవపాలన మాట్లాడుతూ ఆయన రచనలు ప్రాచీన కావ్యాలను తలపించే విధంగా పదపాటిష్యంతో భావనా సంపదతో రూపొందినవని చెప్పారు. పోలూరి వెంకటశివరామ ప్రసాదు మాట్లాడుతూ సంప్రదాయ పద్య సాహిత్యానికి గౌరవం చేకూర్చడం, పద్యకవులను ప్రోత్సహించడంలో చేరెడ్డి పాత్ర గొప్పదని కొనియాడారు. పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి మహా భారతం, కవిత్రయ శైలి అన్నది గొప్ప పరిశోధనని, శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, కొండవీటి కళారేఖ ఒక చారిత్రక కావ్యమని అభివర్ణించారు. గురువులకు గురువు చేరెడ్డి వారని వై త్యాగరాజు పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని ట్రస్టు తరపున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ అందజేశారు. పురస్కారద్రవ్యంగా రూ.5వేలు నగదు, పట్టుబట్టలు, సన్మాన పత్రం, జ్ఞాపికలు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. సన్మాన కార్యక్రమాన్ని వారణాసి రఘురామశర్మ (సాహితీకౌముది గౌరవాధ్యక్షుడు) నిర్వహించారు. కెవి పోలిరెడ్డి (కార్యదర్శి), కోశాధికారి చుండూరి మురళీ సుధాకరరావు, కడియం పాపారావు, కె సుబ్బారావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, కొండకావూరి కుమార్, ఆర్ రాజశేఖర్, కూరపాటి రామకోటేశ్వరరావు సన్మానం విజయవంతంగా నిర్వహించారు. పురస్కార గ్రహీత డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డికి పలువురు కవులు, సాహిత్యవేత్తలు, అభిమానులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాలపర్తి జ్యోతిష్మతి, మోటుపల్లి రామదాసు, తన్నీరు నాగేశ్వరరావు, పిసిహెచ్ కోటయ్య, మహమ్మద్ రఫీ, బత్తుల బాలు, మలాది శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, ఆర్‌వి రాఘవరావు, శివానందరెడ్డి, చిన్ని రమేష్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి

20న మండలాల వద్ద పొగాకు రైతుల ధర్నా

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈనెల 20న పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు, మండలాలతోపాటు అద్దంకి మండలం లోని పంగులూరు తహశీల్దారు కార్యాలయాల వద్ద నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకులు తలపనేని రామారావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు తెలిపారు. గత రెండు నెలలుగా పొగాకు సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈపాటికే పర్చూరు మండలం వీరన్నపాలెంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకోగా, ఇంకొల్లు మండలం దుద్దుకూరులో మరో రైతు ఆత్మహత్యా ప్రయత్నం చేశారని రైతు నాయకులు తెలిపారు. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్ర బాబు, లోకేష్ మాట్లాడినా కూడా కంపెనీలు ముందు కు రావడం లేదని తెలిపారు. ఈనెల 20న రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు పొగాకు రైతులు పాల్గొని జయప్రదం చేయాలి కోరారు. పొగాకుపై ఆంక్షలు విధించకుండా అన్ని గ్రేడ్ల పోగాకు సగటున క్వింటాలు రూ.12,500కు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలు గ్రామాల్లో పంచనున్నట్లు తెలిపారు.



రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

పంగులూరు : నల్లబర్లి పొగాకు కొనుగోలు చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న ధర్నాలు చేయనున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు తెలిపారు. జిల్లాలోని పంగులూరు, ఇంకొల్లు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు మండల కేంద్రాల వద్ద ఈ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులుపాల్గొని జయప్రదం చేయాలని కోరారు. క్వింటా రూ.12500 తగ్గకుండా కొనుగోలు చేయాలని కోరారు.

టిడిపి అధ్యక్షుడిగా 'కూరపాటి '

ప్రజాశక్తి - ముండ్లమూరు



కె శ్రీనివాసరావు

టిడిపి దరిశి ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి ఇంటి వద్ద జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుని ఎన్నికకు కార్యకర్తల అభిప్రాయాలు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, కడియాల రమేష్, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు అడిగి తెలుసుకున్నారు. టిడిపి అధ్యక్షుని కొరకు మాజీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీనివాసరావు, కూరపాటి శ్రీనివాసరావు, దేవినేని కోటేశ్వరరావు ఉంటామని అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చర్చించిన అనంతరం శంకరాపురంకు చెందిన కూరపాటి శ్రీనివాసరావును అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండోసారి అధ్యక్షునిగా ఎన్నిక కావడం పట్ల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. తనకు మరొకసారి అధ్యక్షునిగా అవకాశం ఇచ్చిన టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, కడియాల రమేష్‌కు కూరపాటి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకట్రావు, మాజీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీలు కొక్కెర నాగరాజు, వరగాని పౌలు పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజానేతలకు..

పుచ్చలపల్లి సుందరయ్య నిలువుటద్దం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

ప్రజాశక్తి-కొండపి

నిస్వార్థ ప్రజానేతలకు పుచ్చలపల్లి సుందరయ్య నిలువుటద్దమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకొని కొండపి మండలం పెరిదేపి గ్రామంలో భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో ఎస్‌కె.మాబు మాట్లాడుతూ తన సంపూర్ణ జీవితాన్ని, యావదాస్తిని ప్రజా ఉద్యమాల కోసం అర్పించిన సుందరయ్య జీవితం నేటితరానికి ఆదర్శమని తెలిపారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య భూస్వాములు, సంపన్న వర్గాల అరాచకాలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారని అన్నారు. భూస్వామ్య శక్తులు పేదలను, దళితులను, అనగారిన వర్గాలను అంటరాని వారిగా చేసి వారిపై చేస్తున్న దాడులు, దౌర్జన్యాలు, ఆకతాయిలు అరికట్టేందుకు అప్పట్లో వ్యవసాయ కార్మిక సంఘాన్ని సుందరయ్య స్థాపించారని తెలిపారు. తన సోదరుడు రామచంద్రారెడ్డి చేత వైద్య విద్య చదివించి ఆయన ద్వారా ప్రజా వైద్యశాలను ఏర్పాటు చేసిన ప్రజానేత సుందరయ్య అని తెలిపారు. ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్యుడు డాక్టర్ చాపల వంశీకష్ణ మాట్లాడుతూ సుందరయ్య త్యాగపూరితమైన, ఆదర్శవంతమైన జీవితం అనుసరణీయమన్నారు. అలాంటి మహానేత సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని మెగా వైద్యశిబిరం నిర్వహించేందుకు తనకు అవకాశం కల్పించినందుకు కతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ చాపల శాంత కుమారి మాట్లాడుతూ తమ వైద్యశాలలో ప్రతి నెలా మొదటి గురువారం ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ఖరీదైన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ పెరిదేపి గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను అభినందించారు. ఉచిత మంచినీటి కేంద్రాల ఏర్పాటు, చదువుల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేయడం, గ్రామంలో వ్యాధులు సంభవించిన సందర్భాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న భగత్‌సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. భగత్‌సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మల్లెల రమేష్ మాట్లాడుతూ తమ గ్రామంలో పుట్టి పెరిగి వివిధ ప్రాంతాల్లో అనేక వత్తుల్లో న్న మిత్రులందరూ కలిసి భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత ముప్పరాజు శేషయ్య స్తూపానికి, పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు గంటేనపల్లి వెంకటేశ్వర్లు, ఎం.ఆశీర్వాదం, మల్లెల ప్రభుదాసు, లక్కిపోగు ఆశీర్వాదం, ఎ.థామస్, ఎల్. దావీదు, ఎ. జాంబులు, సిపిఎం జిల్లా నాయకులు కేజీ.మస్తాన్, మండల నాయకులు ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, అంగలకుర్తి బ్రహ్మయ్య, మల్లెల పెద్ద పేతురు, పుట్టా రామారావు, పైడి శ్రీనివాసరావు, సంగాపు ఏసుదాసు, సందడి రమణయ్య, వేములపాటి ఆదిలక్ష్మి, సిహెచ్. బ్రహ్మయ్య, శ్రీరామ్ హాస్పిటల్ మారెటింగ్ మేనేజర్ ఖాసిం సైదా, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, ఫ్రంట్ ఆఫీస్ మేనేజర్ నల్లగట్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు


ముప్పరాజు శేషయ్య స్తూపంవద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చిట్టి చేతులు.. అద్భుత చిత్రాలు..

- పెయింటింగ్‌లో తర్ఫీదు పొందుతున్న చిన్నారులు
- శిక్షణ ఇస్తున్న గురువులు
- వేసవి శిబిరాలకు ఆదరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

చిట్టి చేతులు అద్భుత చిత్రాలను ఆవిషరిస్తున్నాయి. కాన్వాస్ ఏదైనా చిన్నారుల చేతిలోని కుంచె పాదరసంగా కదులుతోంది. ప్రకృతి అందచందాలు, పక్షులు, జంతువులు, దేశ నాయకులు రంగం ఏదైనా ఆకర్షణీయమైన చిత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. చిత్రలేఖనంలో చిన్నారులు తర్ఫీదు పొందుతున్నారు. శిక్షకులు వారిలోని నైపుణ్యాలకు మరింత పదను పెడుతున్నారు. ఒంగోలు నగరంలో నిర్వమిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలపై ప్రజావక్తి ప్రత్యేక కథనం...

ఒంగోలు నగరంలో సృష్టి ఆర్ట్ అకాడమీ, రంగుల ఆర్ట్స్ గ్యాలరీ ఆధ్వర్యంలో చిత్రలేఖనంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలలో చిన్నారులు ఆ తరగతులకు హాజరై తమలోని కళా



నైపుణ్యాలను మెరుగుపరచుకుంటున్నారు. చిన్నారులకు గురువులు సరైన శిక్షణ ఇవ్వటం ద్వారా వారిలోని ప్రతిభను సానబెడుతున్నారు. పెన్సిల్ ఆర్ట్, వాటర్ కలర్స్, ఆక్రాలిక్ కలర్స్‌తో చిన్నారులు అద్భుత కళా ఖండాలను రూపొందిస్తున్నారు.

22 ఏళ్ళుగా సమ్మర్ క్యాంప్స్

తిమ్మిరి రవీంద్ర, సృష్టి ఆర్ట్ అకాడమీ డైరెక్టర్



ఒంగోలు నగరంలో గత 22 ఏళ్ళుగా వేసవిలో చిత్రలేఖన శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నా. పెన్సిల్ ఆర్ట్, వాటర్ కలర్స్, అక్రాలిక్ కలర్స్‌లో శిక్షణ ఇస్తున్నా. శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకల్ వరల్డ్ రికార్డ్స్ స్థానం పొందారు. భవిష్యతులో పెయింటింగ్ క్యాంప్స్ కొనసాగిస్తాం.

2009 నుంచి పెయింటింగ్ నేర్పిస్తున్నా

రంగుల సంధ్య ,
రంగుల ఆర్ట్స్ గ్యాలరీ నిర్వాహకురాలు



2009 సంవత్సరం నుంచి చిన్నారులు, పెద్దలు, మహిళలకు చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్నా. ప్రతి ఏడాది 200 మందికి తగ్గకుండా ట్రైనింగ్ ఇస్తున్నాం. నృత్యం, చేతిరాతలలో చిన్నారులు, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం.

పెన్సిల్ ఆర్ట్‌లో చిత్రాలు గీస్తా

కె.దీపక్, ఒంగోలు



పెన్సిల్ ఆర్ట్‌లో చిత్రాలు గీయటం ఎంతో ఇష్టం. గత నాలుగేళ్ళుగా చిత్రలేఖనం నేర్చుకుంటున్నా. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కోరిక. భవిష్యత్తులో చిత్రలేఖనంలో రాణించేందుకు కృషి చేస్తా. ఆదిశగా నిరరంతం సాధన చేస్తా

7 ఏళ్లుగా సాధన చేస్తున్నా

వి.రాధ, ఆర్టిస్ట్ ఒంగోలు



రంగుల ఆర్ట్స్ గ్యాలరీలో గత ఏడేళ్ళుగా చిత్రలేఖనం సాధన చేస్తున్నా. ఆక్రాలిక్ కలర్స్‌తో చిత్రాలను రూపొందించా. రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీలలో పలు పతకాలు, సర్టిఫికెట్లు సాధించా. భవిష్యత్తులో ఆర్టిస్ట్‌గా కొనసాగుతా.

ప్రకృతి చిత్రాలు గీయటం ఇష్టం

స్వర్ణ దీపిక, 9వ తరగతి



ప్రకృతి చిత్రాలు గీయటం చాలా ఇష్టం. గత ఐదేళ్లుగా సృష్టి ఆర్ట్ ఆకాడమీలో సాధన చేస్తున్నా. ప్రతి సంంవత్సరం సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్నా. డాక్టర్ కావాలన్నది ఆశ. భవిష్యత్తులో ఆర్టిస్ట్‌గా కొనసాగాలని కోరిక.

20న జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకూ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారి టి. భరద్వాజ్ ఒప్రకటన లో తెలిపారు. కెఎల్.గ్రూప్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు మరియు శ్రీ చక్ర హుండాయ్ కంపెనీలో పికింగ్, ప్యాకింగ్, స్టొయింగ్, సార్టింగ్, లోడింగ్, ప్రమోటర్లు మరియు సేల్స్ ఎగ్జిక్యూటివ్ సెక్టార్లలో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐటిఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియేట్, డిగ్రీ పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి జీతం నెలకు రూ 10,000 నుంచి రూ 19,000 ఉంటుందన్నారు. పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఉంటుందన్నారు. 18 నుంచి 29 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ,యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఇంటర్వ్యూలకు వచ్చే వారు తమ ఆధార్, విద్యార్హత సరిఫికెట్ల జిరాక్స్ కాపీలు తీసుకు రావాలన్నారు.



నూతన కమిటీ ఇదే..

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా)ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీకి ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అడ్వజర్‌గా కొట్టే కొండయ్య, కో ఆర్డినేటర్‌గా కలవకొలను వెంకటేశ్వర శాస్త్రి , జాయింట్ సెక్రటరీగా వెన్నా శ్రీరాంరెడ్డి , ఇసి సభ్యులుగా బాచిన శ్రీనివాసరావు, ఈదర సాయి రామ్ ,మొలకల సునీల్ బాబు , ఎక్స్‌ఆషియో మెంబర్‌గా అడే రామ సుబ్బారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సారా ఆస్టోనా కమిటీ అధ్యక్షుడు కొమిరిశెట్టి వెంకట్రావు, కార్యదర్శి నడింపల్లి భూపతి సిన్హా ,కో ఆర్డినేటర్ ఛాగంటి విష్ణు వర్ధన్ రెడ్డి , జాయింట్ సెక్రటరీ ఛోడగుడి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, సులోచన దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ చలివేంద్రం వద్ద వారం వారం మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 7వ వారం దాత వాసవీ క్లబ్ కోశాధికారి పామిడి సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. పామిడి వెంకటసుబ్బయ్య, వెంకట సుబ్బరత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు సుధాకర్ స్వచ్ఛందంగా ఈ మజ్జిగ పంపిణీని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వాసవీ క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, గౌరవ అధ్యక్షులు పాదర్తి గిరి, ఉపాధ్యక్షులు వేమా శ్రీను, సెక్రెటరీ వేమూరి ఆంజనేయులు, కోశాధికారి పి సుధాకర్ , వాసవీ మహిళా సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ, మాజీ అధ్యక్షురాలు శిఘాకొల్లి విజయలక్ష్మి, ప్రతినిధి ఎన్ సుకన్యరాణి, వాసవీ క్లబ్, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న అశోక్ బాబు

వివాహ వేడుకల్లో 'వరికూటి'

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గంలోని అమృతలూరు మండలం మూల్పూరు వైసీపీ నాయకులు తాత సుబ్బారావు కుమారుడు పవన్, రేఖ వివాహ వేడుకకు వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వేమూరు మండలలోని వెల్లబాడు గ్రామం వైసిపీ నాయకులు అద్దేపల్లి మరియధాసు కుమార్తె షాలిని వివాహానికి హాజరై ఆశీర్వదించారు. ఆయన వెంట వైసిపి అమృతలూరు కన్వీనర్ జి హేమచంద్ర, శ్రీనివాసరావు, వేమూరు ఎంపీపీ వై మోహనరావు, వెళ్ళబాడు సర్పంచ్ వెల్లబాటి బుల్లయ్య నూతన వధూవరులను ఆశీర్వదించారు.



జనసేన జెండా దిమ్మె ఆవిష్కరిస్తున్న గాదె

జనసేన జెండా దిమ్మెల ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో జనసేన బలోపేతానికి విన్నకోట సురేష్ చేస్తున్న కృషి అభినందనీయమని గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు చెప్పారు. విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన జనసేన జెండా దిమ్మెల ఆవిష్కరణకు ఆయన హాజరయ్యారు. జండా దిమ్మల ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టిన ఊరు బాపట్ల అన్నారు. అటువంటి పట్టణంలో జనసేన మరింత బలం పుంజు కోవాలని ఆకాంక్షించారు. జనసేనకు విశేషమైన ఆదరణ లభిస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో జనసేన బాపట్లలో పట్టు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాణ్యమైన పాలన అందిస్తూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. జనసేన నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ బాపట్ల నియోజకవర్గంలో జనసేన బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో బాపట్ల నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన కార్యక్రమాలు నిర్వహించి మరింత ప్రజలలోకి తీసుకెళ్లే విధంగా కృషి చేస్తానన్నారు. పట్టణంలో 8వ వార్డుల్లో జనసేన జెండా దిమ్మె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి, విష్ణు మొలకల చంద్రమోహన్, మాడసాని బాలాజీ, కారుమూరి ఆంజనేష్, మాసా కళ్యాణ చక్రవర్తి, మహేష్, ఏసోబు, సాయిబాబు, ధర్మారావు, వినోదు పాల్గొన్నారు.

ఉత్సవాలకు హాజరు కానున్న మంత్రులు

ప్రజాశక్తి - అద్దంకి

శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేకానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరు కానున్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డిబివి స్వామి హాజరు కానుండగా మహాకుంభాభిషేకం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని శాసన సభ్యులు, రాష్ట్ర అధికారులు స్వామి వారి దర్శనం కోసం ఇతర జిల్లాల నుండి భక్తులు రానున్నారని దేవస్థానం సహాయ కమిషనర్, ఇఒ మడమంచి తిమ్మనాయుడు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు తూట్లు

- యదేచ్ఛగాప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగం
- పట్టించుకోని పట్టణ పారిశుద్ధ్య విభాగం
- ఆరంభ శూరత్వంగా మిగిలిన ప్లాస్టిక్‌పై దాడులు

ప్రజాశక్తి - బాపట్ల

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగాన్ని సమూలంగా నిర్మూలించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నప్పటికి పట్టణంలో క్యారీ బ్యాగుల వినియోగాన్ని పురపాలక సంఘం నిలువరించలేకపోతోంది. కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించి జాతిని జాగృతం చేసేందుకు ప్రభుత్వాలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని సమూలంగా నిషేధించేందుకు సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో మాత్రం మున్సిపల్ అధికారులు దీనిపై పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు పర్యావరణ శాస్త్రవేత్తలను విస్మయానికి గురిచేస్తోంది. పట్టణంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు అమ్మకాలపై ఉక్కు పాదం మోపుతామని, ఒక్కరోజు మాత్రమే ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల దుకాణాలపై దాడులు నిర్వహించి సుమారు టన్ను వరకు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు స్వాధీనం చేసుకుని జిందాల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి తరలించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్లాస్టిక్ విక్రయం, వినియోగంపై మునిసిపల్ అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. మున్సిపల్ అధికారుల దాడులు ఆరంభ శూరత్వమేనని తిరిగి ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు అమ్మకం బాపట్లలో రెట్టింపు అయింది. దీనికి తోడు గృహాల నుండి ఉత్పత్తి అయ్యే తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయడం లేదు. సేకరించిన చెత్తంతా కలగా పులగంగా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పట్టణం నుండి కొనుగోలు చేసి తీసుకెళ్లిన క్యారీ బ్యాగులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు విరివిగా వినియోగించడంతో ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా పడేయడంతో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. దీన్ని నిరోధించాలని కలెక్టర్ స్థాయి అధికారులు సైతం ప్రజలను చైతన్యపరిచేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించాలని ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇంత చేస్తున్నప్పటికీ పట్టణంలో క్యారీ బ్యాగుల విక్రయాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీనిపై అధికారుల కనీస నియంత్రణ లేదు. స్థానిక పాలకులకే దీనిపై అవగాహన లేకపోవడంతో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిర్మూలనపై అధికారులకు అవసరమైన సూచనలు చేయడం లేదు. దీనిపై అధికారులు ఏర్పాటు చేసిన సమావేశాలకు ఆహ్వానం మేరకు ప్రజాప్రతినిధి వెళ్లి ప్లాస్టిక్ నిరోధించాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలి. ప్రజలకు హాని కలిగించే దేన్నైనా వినియోగంలోకి తెస్తే సహించేది లేదని మైకులు బద్దలయ్యేలా ప్రసంగాలైతే చేస్తున్నారు. ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. పట్టణంలో ప్రతినిత్యం వందల కిలోల క్యారీ బ్యాగుల విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజారోగ్య శాఖ, పారిశుద్ధ్య విభాగం వీటన్నిటిని చూస్తూనే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల విక్రయాలు, వినియోగానికి మరింత ఊతమిస్తోంది. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిపై చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. కిరాణా దుకాణాల్లో కూరగాయల మార్కెట్లో ఏ వస్తువు కొన్నా క్యారీ బ్యాగులల్లో మాత్రమే ప్రజలు ఆయా వస్తువులు తీసుకెళ్తున్నారు. వీటిని చూస్తున్న మునిసిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగంపై నియంత్రణ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూరగాయలు ఇతర నిత్యావసర వస్తువులు తీసుకెళ్లేందుకు వచ్చే ప్రజలు చేతి సంచులను సైతం తీసుకురావడం మానేశారు. పట్టణంలో నిర్దిష్టంగా ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు చేపట్టాల్సిన అధికారులే పట్టిపట్టనట్లు వ్యవహరించడంతో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వ్యాపారాలు నల్లేరు మీద నడకలా కొనసాగిస్తున్నారు. ఈ క్యారీ బ్యాగులో వినియోగంతో పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్తలో 30శాతం ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు చోటుచేసుకుంటున్నాయి. పట్టణంలో ప్రతి వార్డులో సైడు కాలువల్లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతో నిండిపోయి నీటి ప్రవాహం నిలిచిపోవడంతో దోమలకు ఆవాసంగా మారింది. దోమల ఉత్పత్తికి, పర్యావరణ పరిరక్షణకు, భూతాపాన్ని నివారించేందుకు, పుడమి తల్లిని పరిరక్షించేందుకు వీటన్నిటితో అనుసంధానమైన ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిర్మూలనపై అధికారులకు సైతం కనీసం అవగాహన లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగంతో ఏర్పడుతున్న కాలుష్య రక్కసి నుండి ప్రజలను కాపాడేందుకు పచ్చదనం కోసం ఎన్ని మొక్కలు నాటిన క్షేత్రస్థాయిలో భూతాపాన్ని కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిర్మూలించకపోతే ప్రయోజనం శూన్యమేనని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల అమ్మకాలను, వినియోగాన్ని అరికట్టేందుకు కలెక్టర్ స్థాయి అధికారి సైతం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



వినియోగదారుల చేతుల్లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు

ప్రజల్లో అవగాహన అవసరం

క్యారీ బ్యాగుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడం మరిచారు. ఎవరికి వారు మనకెందుకులే అనుకుంటే భవిష్యత్ తరాలు కాలుష్యం కోరల్లో చిక్కి విలవిలలాడాల్సిన పరిస్థితి ఎదురుకానుంది. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు భూమిలో కరగక వాటి నుండి వెలువడే సెగలను తట్టుకునేందుకు పుడమికి పచ్చదనాన్ని నింపే దిశగా స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఎవరికి వారు మనకెందుకులే అనుకుంటే భవిష్యత్తులో భూతాపం పెరిగి మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛందంగా ప్రజలే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతో పాటు పర్యావరణానికి హాని కలిగించే వస్తువుల వినియోగాన్ని సమూలంగా నిర్మూలించే దిశగా పాఠశాలలో విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉంది. కనీసం నేటి విద్యార్థులైనా పెరిగి పెద్దవారై దీన్ని పాటిస్తారని ఆశిద్దాం.



మార్కెట్లో యధేశ్చగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు

లంక గ్రామాల్లో కంద, పసుపు పంటలు కరువాయే !



లంక గ్రామాల్లో సాగుచేసిన అరటి పంట



కందపంట సాగు చేసేందుకు సిద్ధం చేసిన పొలం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో లంక గ్రామాల్లో ప్రతి ఏట సాగు చేసే వాణిజ్య పంటలైన కంద, పసుపు పంటలు సాగయే పరిస్థితి కనిపించడం లేదు. గతేడాది అధిక వర్షాలతో కృష్ణా నదికి సంభవించిన భారీ వరద కారణంగా లంక గ్రామాల్లో పసుపు, కంద, అరటి, తమలపాకు వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీని కారణంగా రైతులు పసుపు, కంద విత్తనాల కోసం నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోయింది. పంటలు సాగు చేయ టానికి పసుపు, కంద విత్తనాల ధరలు ఆకాశాన్ని అంటు తున్నాయి. ఎకరం పొలానికి కంద పంట సాగు చేయ డానికి రూ.3 లక్షల పైగా వెచ్చించాల్సి వస్తుంది. పసుపు కూడా ఎకరాకు రూ.40 వేల నుండి రూ.50 వేల వరకు విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇంత ఖర్చు పెట్టి సాగు చేస్తే పంట చేతికందక ముందే కృష్ణా నదికి మరో సారి వరదలు సంభవిస్తే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు సాగుకు భయపడుతున్నారు. వాణిజ్య పంటలు సాగు చేయటం అంటే రూ.లక్షల పెట్టుబడిగా వెచ్చించాల్సి ఉంటుంది. వాతావరణం పూర్తిగా అనుకూలిస్తే సక్రమంగా పంట చేతికి అందితే ఖర్చులు పోను ఎంతో కొంత రైతుకు మిగులుతుంది. అది కూడా పంటకు గిట్టుబాటు ధర లభిస్తేనే గత కొన్నేళ్లుగా పసుపు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. గతేడాది పసుపు పంటకు కొంతమేర ధర ఆశా జనకంగా ఉండటంతో అనేక మంది రైతులు నిల్వ చేసుకున్న పసుపును విక్రయించుకున్నారు. ఆ ధరలు కొన్ని రోజులు మాత్రమే కొనసాగాయి. ప్రస్తుతం పసుపు రైతులు అమ్ముకోవడనికి క్వింటా ధర రూ.10వేలకు మించలేదు. కానీ విత్తనం ధర మాత్రం ఆకాశాన్ని అంటుతుందని, ఇంత కష్టపడి వెచ్చించి సాగు చేస్తే ప్రకృతి ఏ విధంగా ఉంటుందో అర్థం కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరటి పంట కూడా సాగు చేయటానికి రైతులు మక్కువ చూపటం లేదు. వరదలు సంభవిస్తే అరటి పంట సైతం పూర్తిగా దెబ్బతింటుందని, అరటికీ గిట్టుబాటు ధర లేకపోవడం లేదా అధిక వర్షాలు, ఈదురు గలులు, తుఫానులు సంభవిస్తే నేలవాలి పంట దెబ్బతిని నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. తమలపాకు పంట సైతం వరద నీటిలో మునిగిపోయిన పంట పూర్తిగా దెబ్బతింటుందని, దీనివలన సాగు చేయడానికి రైతులు ముందుకు రావడం లేదు.

సాగు చేయటం ఇష్టం లేక ఖాళీగా పంట పొలాలు

పెరిగిన విత్తన ధరలు, మారుతున్న అననుకూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది రైతులు వాణిజ్య పంటలు సాగు చేయటానికి ఇష్టం లేక పంట పొలాలు ఖాళీగానే ఉంచారు. ప్రతి ఏట ఏప్రిల్ నెల నుండి జూన్ 15కల్లా పసుపు, కంద వంటి పంటలు రైతులు సాగు చేసేవారు. కానీ ప్రస్తుతం మే నెల చివరికి చేరుకున్నప్పటికీ రైతులు సాగు చేయటానికి ముందుకు రాకపోవడం, సాగు పట్ల అనాసక్తి కనిపిస్తుంది. పంటలకు గ్యారెంటీ లేకపోవడంతో ప్రస్తుతం ఖాళీగా వదిలేసి రెండు, మూడు నెలల తరువాత మినుము, మొక్కజొన్న పంటలు సాగు చేసుకునే ఆలోచనలో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గతేడాది వరదలకు పూర్తిగా రూ.లక్షల్లో నష్టపోగా ప్రభుత్వం నుండి ఎకరాకు రూ.14 వేలు నష్టపరిహారం దక్కిందని, దాని వలన అప్పటికే చేసిన అప్పులు తీరే మార్గం లేక వడ్డీలు పెరిగిపోయాయని, ఈ ఏడాది సాగుకు సొమ్ము తెచ్చుకునే పరిస్థితి తెచ్చుకునే పరిస్థితి కనిపించడ లేదని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

నేడు టిడిపి నియోజకవర్గ మహానాడు

ప్రజాశక్తి - వేమూరు

స్థానిక ఎన్టీఆర్ పుర వేదిక వద్ద సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు నియోజకవర్గ టిడిపి మహానాడు జరుగుతుందని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు కార్యాలయ వర్గాలు తెలిపాయి. శాసన సభ్యులు ఆనందబాబు పాల్గొంటారని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

టిడిపి అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దాం

నియోజకవర్గస్థాయి మహానాడులో శాసన సభ్యులు ఎంఎం కొండయ్య



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని, గతంలో మాదిరిగా గొడవలు, అల్లర్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు పనులు స్వేచ్ఛగా చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక గోలిసదాశివరావు కల్యాణ మండపంలో నియోజవర్గ స్థాయి మినీ మహానాడు టిడిపి అధికార ప్రతినిధి మద్దలూరి మహేంద్ర నాథ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ కొండయ్య మాట్లాడుతూ తెలుగుదేశం స్థాపించినప్పటి నుండి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. కష్టపడిన ప్రతి ఒక్క నాయకుడిని, కార్యకర్తను అధిష్టానం గుర్తిస్తుందని అన్నారు. సందర్భాన్ని బట్టి వారికి ఆయా పదవులు కేటాయిస్తుందని అన్నారు. తాను కూడా గతంలో ఎన్నో సంవత్సరాలు పార్టీ కోసం పని చేస్తేనే నేటికీ ఫలితం దక్కిందని అన్నారు. ఆ విధంగా ప్రతి ఒక్కరు ఓపికతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేసి పార్టీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా మహానాడును టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రంలో ఘనంగా నిర్వహించు కుంటున్నామని అన్నారు. అదే తరహాలో ఈ ఏడాది కడపలో నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, శిద్ధి బుజ్వేశ్వరరావు, గుద్దంటి చంద్రమౌళి, గంజి పురుషోత్తం, కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి, ఉల్లిపాయల సుబ్బయ్య, మామిడాల రాములు, మించాల సాంబశివరావు, మల్లెల లలిత, సల్లూరి సత్యానందం, దాసరి శారద, గోలి స్వాతి పాల్గొన్నారు.

సైనికుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే ర్యాలీ



ర్యాలీలో జాతీయ జెండాతో ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెడుతూ శత్రువుల నుండి దేశాన్ని రక్షిస్తున్న సైనికుల్లో ఆత్మ ధైర్యాన్ని నింపేందుకే జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించి ఉత్సాహాన్ని నింపుతున్నామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. పాకిస్తాన్‌పై అపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో భారత సైనిక దళాలకు సంఘీభావంగా ఆదివారం టిడిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్ర నాద్‌తో కలసి కూటమి నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు.

అద్దంకి : ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో భారత త్రివిధ దళాలకు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సంఘీభావంగా పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుండి బంగ్లా రోడ్డు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు 'తిరంగా ర్యాలీ'ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆపరేషన్ సింధూర్ ద్వారా గుణపాఠం చెప్పిన వీర సైనికుల విజయకేతనానికి సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



అద్దంకిలో ర్యాలి నిర్వహిస్తున్న కూటమి నేతలు

రేషన్ కార్డు మంజూరులో మార్పు లేదా ?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం పేదలకు జారీ చేస్తున్న రేషన్ కార్డు విధానంలో ఎలాంటి మార్పులు లేకపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రైస్ కార్డును జారీ చేసేందుకు ప్రస్తుతం జీఓ విడుదల చేసి అమలు చేస్తుంది. ఈ విధానంలో కార్డు లేని వారు నూతన కార్డును పొందేందుకు దోహదపడుతుంది. కానీ గత ప్రభుత్వం అమలు చేసిన విధానాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అమలు చేయడం పట్ల కార్డు జారీ విధానంలో అనేక మందిలో నిరాశ ఎదురవుతుంది. గత ఆరేళ్లుగా నిరుపేద కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగాన్ని పొంది, వివాహం చేసుకొని బయటకు వెళ్లిపోయిన అనేక మంది మహిళలు కుటుంబ రేషన్ కార్డులో ఉన్నారు. పేరు తొలగించేందుకు ఎలాంటి విధివిధానాలు లేకపోవడం పట్ల నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు నోచుకోక అల్లాడుతున్నారు. కుటుంబంలో కుమారుడు ఉద్యోగం పొందితే ఆ కుటుంబానికి అతను బాధ్యత వహిస్తాడనేది భారత సంస్కృతి విధానం. కానీ అదే కుటుంబంలో కుమార్తె కూడా ఉద్యోగం పొంది వివాహం చేసుకొని బయటకు వెళ్లిపోతే తల్లిదండ్రులకు ఆమె వలన ఎలాంటి భరోసా ఉండదు. అలాంటి సమయంలో ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలు సద్వినియోగపరుచుకుంటూ జీవనాన్ని కొనసాగించేందుకు ఆసరాగా ఉంటుంది. కానీ ఈ విధానంలో ప్రభుత్వం ఉద్యోగం పొంది, వివాహం చేసుకొని వెళ్లిపోయిన మహిళను రేషన్ కార్డు నుండి తొలగించేందుకు ఎలాంటి అవకాశాన్ని కల్పించకపోవడంతో పేద కుటుంబాలు ప్రభుత్వ విధానం పట్ల అనాసక్తితో ఉన్నారు. ఉద్యోగం చేసే కుమార్తెను మరొక ఉద్యోగికి ఇచ్చి వివాహం చేస్తే కుమార్తె పేరును వివాహం చేసుకున్న వ్యక్తి కుటుంబ కార్డులో చేర్చేందుకు కూడా అవకాశం లేదు. ఎందుకంటే అతని కుటుంబకార్డు కూడా ఉద్యోగం చేస్తున్నాడనే దృక్పథంతో తొలగించబడి ఉంటుంది. అలాంటి సమయంలో వీరి ఇరువురిని కార్డులో ప్రత్యేక కుటుంబంగా విడగొడితే వారిని కన్న తల్లిదండ్రులకు ప్రభుత్వం నుండి అందే పథకాలు దక్కే అవకాశం ఉంది.

ఆదాయ పన్ను చెల్లిస్తున్నారని దృక్పథం

ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు ఆదాయ పన్ను చెల్లిస్తున్నారనే దృక్పథంతో వారి పేర్లు నమోదు ఉన్న రేషన్ కార్డులను ప్రభుత్వం నిర్ధాక్షణంగా తొలగిస్తుంది. పిల్లలను చదివించి ఉద్యోగస్తులుగా చేయించడమే తాము చేసిన తప్పా అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రభుత్వ పెద్దలు దీనిపై దృష్టి సారించి వివాహం చేసుకుని మరొక ఇంటికి వెళ్లిపోయిన ఉద్యోగం చేసే ఆడపిల్లల పేర్లను కన్న తల్లిదండ్రుల కార్డులో నుండి తొలగించి ఆ కుటుంబానికి ఆసరా కల్పించాలని కోరుచున్నారు.

యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని రమణారెడ్డివారిపాలెం గ్రామానికి చెందిన పునుగుపాటి నాగమల్లిక అనే యువతని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి గర్భవతిని చేసిన అదే గ్రామానికి చెందిన ఇస్త్రాల మణికంఠ అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె కమలాకర్ ఆదివారం తెలిపారు. గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన మల్లికను వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన ఇస్త్రాల మణికంఠ సుమారు ఏడాది నుండి ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని పలుమార్లు శారీరకంగా ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆ యువతిని అనుభవించినట్లు, అప్పటి నుండి ఆ యువతిని శారీరకంగా కలుస్తూ గర్భవతిని చేశాడని ఎస్ఐ తెలిపారు. ఆ యువతి మణికంఠను వివాహం చేసుకోవాలని, తనకు గర్భం వచ్చిందని చెప్పడంతో ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని, నిన్ను పెళ్లి చేసుకుంటానంటూ దాటవేస్తూ వచ్చాడని తెలిపారు. ఆ యువతి మణికంఠను గట్టిగా నిలదీయగా నిన్ను పెళ్లి చేసుకోను, ఇష్టం వచ్చింది చేసుకోమని మణికంఠ తెలపడంతో ఆ విషయాన్ని ఆ యువతి కుటుంబ సభ్యులకు తెలియజేసిందని, తల్లి, బంధువులు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించగా ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భవతి అని వైద్యులు చెప్పారని తెలిపారు. కుటుంబ సభ్యులు మణికంఠ వద్దకు వెళ్లి తమ కూతుర్ని పెళ్లి చేసుకోమని అడగగా 'మీ కుమార్తె గర్భానికి నాకు ఎలాంటి సంబంధం లేదని, నేను వివాహం చేసుకోనని' తేల్చి చెప్పాడని తెలిపారు. ఏమి చేయాలో అర్థం కాని ఆ యువతి తల్లి, బంధువులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కె కమలాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైకులు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం పట్టణంలోని ద్వారకా నగర్ వద్ద జరిగింది. పట్టణంలోని ఇందిరానగర్కు చెందిన మస్తాన్ వలి వ్యక్తిగత పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగ స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించడంతో క్షతగాత్రుడుని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎయిడ్స్ బాధితులకు కొవ్వొత్తులతో సంఘీభావం

ప్రజాశక్తి - బాపట్ల

ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు క్యాండిలైట్లతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సంఘీభావం తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో అంతర్భాగమైన ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశం మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి, ఎయిడ్స్, దిశా సంయుక్తంగా 42వ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిలైట్ మెమోరియల్ డే ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా డిఎం అండ్ హెచ్ఓ ఎస్ విజయమ్మ జెండా ఊపి క్యాండిల్ లైట్ ర్యాలీ ప్రారంభించారు. పాత బస్టాండ్ చేరుకుని మానవహారం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలి సారిగా అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిలైట్ మెమోరియల్ డే 1983లో ప్రారంభించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ప్రతిఏటా మే నెలలో 3వ ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లెప్రసీ, ఎయిడ్స్, టీబీ జిల్లా అధికారి షేక్ మొహమ్మద్ సాదిక్, ఐసీటీసీ, పీపీటీసీటీ, డిఎస్ఆర్సి కౌన్సిలర్లు, ల్యాబ్టెక్నీషియన్స్, జిల్లా కేర్ సపోర్ట్ సెంటర్ ప్రాజెక్ట్ సిబ్బంది, జిల్లాలోని టార్గెట్ ఇంటర్వెన్షన్ ఎన్జీఓస్, గ్రామ సిరి మహిళామండలి సిబ్బంది పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మైనేని మురళీకృష్ణ

వ్యవసాయ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని కొల్లూరు పంట కాలువల పూడిత తీత పనులను నీటి సంఘం డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులు యలవర్తి కోటేశ్వరరావు, దోనేపూడి న్యూ రౌట్ ఛానల్‌ను రావికంపాడు న్యూ రౌట్ ఛానల్‌లో పేరుకుపోయిన తూటి కాడ, గుర్రపు డెక్క, వ్యర్థ పదార్థాలు అధికంగా పేరుకుపోవడంతో ఆదివారం రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులతో కలిసి తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పబ్బిశెట్టి వెంకట సత్య కుమార్, గోరికిపూడి ప్రసాద్, పెదపూడి నాగరాజు, కోగంటి సాంబయ్య, గాదె చంటి, బుర్రి జగన్, యడ్ల శ్రీనివాస్, మున్నంగి విజయ్ ఉన్నారు.



కళశం ప్రతిష్టిస్తున్న ఇఒ, భక్తులు

ప్రసన్నాంజనేయ కలశ ప్రతిష్ట

ప్రజాశక్తి - అద్దంకి

శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో మహా కుంభాభిషేకం సందర్భంగా ఆదివారం స్వామివారి కలశాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించారు. కార్యక్రమంలో స్వామివారి ముఖం మండపం ముఖ్యదాతలు, సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మదమంచి తిమ్మనాయుడు, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.



కలశం వద్ద బందోబస్తుపై పరిశీలిస్తున్న డిఎస్పి

కలశం వద్ద బందోబస్తు పరిశీలన

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ దేవస్థానంలో జరిగే కుంభాభిషేకానికి ఎలాంటి అవాంతరాలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డిఎస్పి మహమ్మద్ మోయిన్ తెలిపారు. దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక డీఎస్పీ, ఐదుగురు సిఐలు, 15మంది ఎస్ఐలు, మిగిలిన ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌తో సహా 285మంది విధుల్లో ఉంటారని అన్నారు. ఉదయం జరిగే కలశాభిషే కానికి 6 నుండి 9 గంటల వరకు యాత్రకు ఇబ్బంది కలుగ కుండా ట్రాఫిక్కు అంతరాయం లేకుండా సహ కరించాలని స్థానికులను కోరారు. కుంభాభిషేకం అనంతరం సాధారణ భక్తులకు దర్శనం ఏర్పాటు జరుగు తుందని తెలిపారు. కలశ పాదయాత్ర సమయంలో రోడ్లపై వాహనాలు నిలుప రాదని అన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఆరాధ్యుల సుబ్బరాజు, రూరల్ సీఐ బి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు కొప్పరం రానున్న శృంగేరి జగద్గురు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొప్పరం గ్రామానికి శృంగేరి జగద్గురు విధుశేఖర భారతి మహాస్వామి సోమవారం రానున్నట్లు కొప్పరం గ్రామ సిద్ధాంతి చింతలపాటి హరి నారాయణ కృష్ణ తెలిపారు. నీలకంఠ శతజయంతి సభలో పాల్గొంటారని తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె జులై 9కి వాయిదా

- 20న నిరసనలు చేపట్టాలి
- అఖిలపక్షకార్మిక సంఘాలు. సంయుక్త కిసాన్ మోర్చా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె వాయిదా పడింది.ఈ సమ్మెను జులై 9న నిర్వహించాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. స్థానిక సిఐటియు కార్యాలయంలో అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ ఈనెల 20 తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జులై 9న జరపాలని కేంద్ర కార్మిక సంఘాలు , సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయించినట్లు తెలిపారు. జూలై 9న నిర్వహించనున్న సమ్మెను దేశవ్యాప్తంగా జిల్లాలో అమలు చేయాలని ఉద్యోగులకు కార్మికులకు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 20న జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. భారత్, పాకిస్తాన్ దేశాలు యుద్ధం ప్రారంభించడం, విరమించడం లాంటి వాతావరణంలో ఉత్తరాది రాష్ట్రాల్లో ఉద్రిక్త వాతావరణం కారణంగా ఈ నెల 15న అఖిలపక్ష కార్మిక సంఘాలు సమావేశమై దేశవ్యాప్త సమ్మె వాయిదా వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను అమలు చేయడంలో వెనకాడటం లేదన్నారు. కేంద్రం ఆ ప్రయత్నం చేస్తూనే ఉందన్నారు. అన్ని రాష్ట్రాల్లో లేబర్ కోడ్స్ అమలు చేయడానికి విధివిధానాలు తయారు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మొండిగా లేబర్ కోడ్స్ అమలు చేయాలని చూస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా జులై 9న సమ్మె చేపట్టి నిరసన తెలియజేయాలన్నారు. ఈనెల 20న దేశవ్యాప్తంగా అవకాశం ఉన్నచోట నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. లేబర్ కోడ్స్ అమలు అయితే ఎనిమిది గంటలకు బదులు 12 గంటల వరకూ పని చేయాల్సి ఉంటుందన్నారు. మహిళలు సైతం రాత్రివేళల్లో పనిచేయాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. పరిశ్రమలలో తనిఖీలు కంపెనీలకు అనుకూలంగా ఉంటాయన్నారు. యూనియన్ల ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోతుందాన్నరు. కాంట్రాక్టు కార్మికుల జీవన పరిస్థితులు మరింత దుర్భరంగా తయారయ్యే పరిస్థితి వస్తుందన్నారు. సమ్మె హక్కు కోల్పోవాల్సివస్తుందని తెలిపారు. ప్రమాదకరమైన లేబర్ కోడ్స్ అమలు వల్ల భారతదేశంలోని ఉద్యోగ వర్గం, కార్మిక వర్గం, రైతాంగం సంక్షోభంలో చిక్కుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ మాట్లాడుతూ ఈనెల 20న ఒంగోలు నగరం,మున్సిపల్ పట్టణాలు నియోజకవర్గ కేంద్రాలు, పట్టణ కేంద్రాలు, మండలాల్లో సభలు ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. మోహన్ మాట్లాడుతూ ఈనెల 20న తలపెట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగస్వాగముల మవతామని ప్రకటించారు. ఎఐయఫ్‌టియు (న్యూ) జల్లా కార్యదర్శి సాయి మాట్లాడుతూ సమ్మెను వాయిదా వేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తామన్నారు. ఉద్యోగ, కార్మిక సంఘాలతో భాగస్వామిగా ఉంటామని, ఉద్యోగులని కార్మికుల్ని కదిలించి సమ్మెలో పాల్గొంటామన్నారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకుడు రంగారావు, ఎల్ఐసి యూనియన్ డివిజన్ నాయకులు పారా శ్రీనివాసరావు, సారధి తదితరులు పాల్గొన్నారు.


మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

సమస్యలు పరిష్కరించాలని..

మోకాళ్లపై నిల్చొని సిహెచ్‌ఒల నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరింది. సమ్మె లో భాగంగా మానవహారం, నిరసన ర్యాలీ నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని, తమ డిమాండ్లపై చర్చించేందుకు చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించాలని కోరుతూ మోకాళ్ళ పై నిలబడి నిరసన చేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎపిఎంసిఎ) రాష్ట్ర కార్యదర్శి బిర్రు సందీప్ కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ కుమార్ నాయక్ మాట్లాడుతూ శ్రమకు తగిన వేతనం ఇవ్వడంలేదని వాపోయారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రూ.40 వేల వేతనం అని సర్క్యులర్ ఇచ్చి, ఆచరణలో రూ. 25 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారని విమర్శించారు. గ్రామాల్లో, కొండ ప్రాంతాలలో సెల్ ఫోన్ నెట్వర్క్ లేనిచోట పనిచేస్తుంటే ఎఫ్ఆర్ఎస్ పేరుతో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు మాత్రమే జీతాలు కట్ చేస్తున్నారని వాపోయారు.గత ప్రభుత్వంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు అందరికి జీవో నెంబర్ 64 తో ఇచ్చిన 23 శాతం వేతన పెంపుదల వెంటనే అమలు చేయాలన్నారు. సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గత ఆరు సంవత్సరాల నుంచి గ్రామీణ, కొండ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు కేన్సర్ స్క్రీనింగులు, ఎన్ సిడిసిడి స్క్రీనింగ్‌లు, టెలిమెడిసిన్ సేవలు , చిన్నపిల్లలకు, గర్భిణులకు 12 రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 14 రకాల డయాగ్నోస్టిక్ టెస్టులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లపై చిన్న చూపు తగదన్నారు.ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లల్లో పారిశుధ్య పనులకు చేయడానికి కంటిజెంట్ వర్కర్ ఏర్పాటు చేయాని కోరారు. ఈకార్యక్రమంలో ఎపిఎంసిఎ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగళగిరి రాజేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ శ్రీకాంత్ , జిల్లా సెక్రెటరీ గంటా ప్రసన్న ,జిల్లా ఉప అధ్యక్షురాలు జీవన్ జ్యోతి, పసుపులేటి శైలజ ,దీప్తి, కామేష్ ,రామాంజనేయులు, సిహెచ్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. అలాగే వివిధ రకాల క్రీడలు నిర్వహించారు. కథలు చదివించారు. వార్తలు రాయించారు. ఈ వేసవి శిబిరంలో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొని శిక్షణ పొంది విజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలని గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ తెలిపారు. పది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరే లక్ష్యం

- జలజీవన్ మిషన్ పనులు ముమ్మరం
- ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్
- అమృతధార మెగా ప్రాజెక్టుకు ప్రతిపాదనలు
- జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఇ ఎం. అనంతరాజు



ముఖాముఖి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నట్లు జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఇ ఎం. అనంతరాజు తెలిపారు. జిల్లాలో జలజీవన్ మిషన్ పనులను ముమ్మరం చేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జలజీవన్ మిషన్ పనులు, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు విషయం గురించి ఎస్ అనంతరాజు ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

జిల్లాకు రూ.149 కోట్ల నిధులతో 337 పనులు మంజూరయ్యాయి. ఆ పనులకు టెండర్లు పిలిచారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి అమలు చేస్తున్నారు. అవసరమైన చోట్ల సమగ్ర నీటి సరఫరా పథకాలు చేపడుతున్నారు. వేసవిలో నీటి ఇబ్బందులు లేకుండా తాగునీటి బోర్ల మరమ్మతులు చేపట్టారు. తాగునీటి పథకాల మరమ్మతులు, సిబ్బంది జీతభత్యాల కోసం గుంటూరు, ప్రకాశం జిల్లా పరిషత్‌లనుంచి 15 ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. సమగ్ర మంచినీటి పథకం మరమ్మతుల కోసం పర్చూరు నియోజకవర్గానికి రూ 1.90 కోట్లు ,చీరాలకు రూ.1.05 కోట్లు, రేపల్లెకు రూ.3 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కెనాల్ కింద మొత్తం 192 మంచినీటి చెరువులు ఉన్నాయి. డెల్టా పరిధిలోని అన్ని చెరువులను నింపారు. నాగార్జున సాగర్ కాలువ పరిధిలోని చెరువులను 40 శాతం నింపారు.ఈ వారంలో సాగర్ కాలువకు నీరు విడుదల చేసిన వెంటనే అన్ని చెరువులను పూర్తి స్థాయిలో నింపుతారు.

ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్

జిల్లాలోని ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్నదే ధ్యేయం. కొమ్మమూరు కాలువ, సాగర్ కాలువ ద్వారా వస్తున్న జలవనరులను సద్వినియోగం చేసుకొని తాగునీటి అవసరాలను తీర్చేందుకు కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల నిధులతో జలజీవన్ మిషన్ పనులను జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వరర్యంలో చేపట్టారు. గ్రామీణ ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు జలజీవన్ మిషన్ ద్వారా జిల్లాలో గతంలో రూ.470 కోట్లు నిధులతో 1,420 పనులను చేపట్టారు.వివిధ కారణాలతో 963 పనులు నిలచిపోయాయి. 430 పనులు చేపట్టగా 325 పనులు పూర్తయ్యాయి.

అమృతధార మెగా ప్రాజెక్టుకు ప్రతిపాదనలు

జిల్లా ప్రజకు భవిష్యత్‌లో తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రకాశం బ్యారేజి ద్వారా, సాగర్ ప్రాజెక్టు ద్వారా రూ. 3,200 కోట్ల అంచనాలతో అమృతధార మెగా ప్రాజెక్టు కోసం ప్రతిపాదనలు రూపొందించి కేంద్రప్రభుత్వానికి నివేధించారు. అదేవిధంగా నూతన రక్షిత మంచినీటి పథకం నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపారు. నాగార్జున సాగర్ కాలువకు అనుసంధానంగా అద్దంకి , పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని సంతమాగులూరు,బల్లికురవ,యద్దనపూడి,వ ూర్టూరు,జె.పంగలూరు మండల పరిధిలోని111 హేబిటేషన్లకు తాగునీటి సరఫరా కోసం రూ.700 కోట్లతో రక్షిత మంచినీటి సరఫరా పథకాల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు రూపొందించారు. ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా కాలువ ద్వారా వేమూరు, రేపల్లె, బాపట్ల,చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో 18 మండలాల పరిధిలోని171 హేబిటేషన్లకు తాగునీటి సరఫరా కోసం రూ.2,300 కోట్ల అంచనాలతో రక్షిత మంచినీటి సరఫరా పథకాల కోసం నివేదికలు తయారు చేశారు. జిల్లా పరిధిలో ఉన్న గుండ్లకమ్మ ద్వారా రూ.200 కోట్లతో మరొక రక్షిత మంచినీటి పథకం నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు.

స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ విధానం అమలు

కేంద్ర ప్రభుత్వ గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్య శాఖ, టూరిజం శాఖ తో కలసి జిల్లాలో స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా కమిటీతో పాటు, బాపట్ల డివిజన్, చీరాల డివిజన్, రేపల్లె డివిజన్ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్ గా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి, జిల్లా పంచాయతీ అధికారి సభ్యులుగా, గ్రామీణ నీటిసరఫరా పర్యవేక్షక ఇంజినీర్ కన్వీనర్ గా, జిల్లా టూరిజం అధికారి సభ్య కార్యదర్శిగా ఉంటారు. డివిజన్ కమిటీలో రెవెన్యూ డివిజన్ అధికారి చైర్మన్‌గా, డివిజనల్ అభివద్ధి అధికారి, హెడ్ క్వార్టర్ మండల అభివద్ధి అధికారి సభ్యులుగా, గ్రామీణ నీటిసరఫరా ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కన్వీనర్‌గా ఉంటారు. స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ విధానం అమలులో ఆతిథ్య సేవలు అందించే హోటల్స్, హోంస్టేలు, లాడ్జీలు మొదలగు వాటిలో పారిశుధ్య నిర్వహణ, మురుగునీటి నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో పని చేసేవారికి వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రీన్ లీఫ్ రేటింగ్‌కు సరిపడేలా వ్యర్థాల నిర్వహణ చేయాలి.కమిటీలు పరిశీలించి గ్రీన్ లీఫ్ రేటింగ్‌లు ఇస్తారు.